ఖరీఫ్ సాగులో రైతన్న బిజీ

- పత్తి విత్తనాలు నాటే పనిలో, వరినారు మడుల తయారీలో రైతులు నిమగ్నం



బొండపల్లిలో పత్తి విత్తనాలు విత్తుతున్న మహిళా రైతులు



వేపాడ ఆర్‌బీకేలో పంపిణీకి సిద్ధం చేసిన వరి విత్తనాలు

బొండపల్లి: ఖరీఫ్ పంటల సాగు పనుల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు. ఇటీవల అడపాదడపా వర్షాలు కురవడంతో రైతులు దుక్కు లు చేపట్టారు. అదును కుదరడంతో పత్తి విత్తనాలు నాటడంతో పాటు వరి నారుమడుల తయారీ పనుల్లో నిమగ్నమయ్యారు. గజపతినగరం వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలో ఖరీఫ్‌లో రైతులు ఎక్కు వగా సాగుచేసే పంట వరి కాగా, తర్వాత స్థానం ప్రత్తి పంటది. గజపతినగ రం సబ్ డివిజన్ పరిధిలోని మెంటాడ, బొండపల్లి, దత్తిరాజేరు, గజపతినగరం మండలాల్లో రైతులు ఏటా సుమా రు 4వేల హెక్టార్లలో పత్తి పంటను సాగు చేస్తుంటారు. గత నాలుగు రోజులుగా సబ్ డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో మెట్టు భూముల్లో పత్తి విత్తనాలు నాటే పనులు జోరుగా సాగుతున్నాయి. తెల్లబంగారంగా పిలిచే పత్తికి కొన్నేళ్లుగా మార్కెట్‌లో మంచి ధర పలుకుతుండడంతో ఈపంట సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో గతేడాది 13, 500 హెకార్టల్లో వరి పంటను సాగుచేశారు. ఈఏడాది 14వేల హెక్టార్లల్లో వరి సాగు చేయడానికి అవకాశం ఉన్నట్లుగా అధికారులు గుర్తించి, అందుకు సరిప డా వివిధ రకాల వరి విత్త నాలను ముందస్తుగానే ఏపీ సీడ్స్ ద్వారా సిద్ధం చేశారు. రైతు భరోసా కేంద్రాల(ఆర్బీకే)కు ఈనెల మొదటి వారంలోనే సరఫరా చేశారు. ప్రస్తుతం రాయితీపై రైతులకు వరి విత్తనాల పంపిణీ ఆర్బీకేల ద్వారా అధికారులు చేపడుతున్నారు.

795.85 క్వింటాళ్ల వరి విత్తనాల పంపిణీ

వేపాడ: మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే)ద్వారా రాయితీపై వరి విత్తనాల పంపిణీ జోరుగా సాగుతోంది. మండలంలో ఇప్పటివరకు 18 ఆర్బీకేల పరిధిలో వివిధ రకాలకు చెందిన 795.85 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశామని ఏఓ సి.బి.యశ్వంత రావు తెలిపారు. మొత్తం 1532 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు చేయగా 883.40 క్వింటాళ్లు మండలానికి చేరుకున్నాయని, వాటిలో 798.85 క్వింటాళ్లు పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఎంటీయూ–1121 రకం 743 క్వింటాళ్లు, ఎంటీయూ –7029 స్వర్ణ రకం 28.50 క్వింటాళ్లు, బీపీటీ–5204 సాంబమసూరి 15.25 క్వింటాళ్లు, ఎంటీయూ–1224రకం 6.25 క్వింటాళ్లు, ఎంటీయూ –1318రకం 6 క్వింటాళ్ల విత్తనాలు రైతులకు అందజేశామన్నారు. అలాగే రాయితీపై పచ్చిరొట్ట ఎరువుల విత్తనా లు జీలుగ, కట్టె జనుమను రాయితీపై ఇస్తున్నామని చెప్పారు. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్‌బికె కేంద్రాల్లో వీఏఏలను సంప్రదించాలని ఏఓ సూచించారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి అమ్మవారు

చీపురుపల్లి: పట్టణంలోని కనక మహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ నేతృత్వంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం అమ్మవారికి ఆదివారం ప్రత్యేకత కలిగిన రోజు కావడంతో తెల్లవారు జామున 5 గంటలకు పంచామృ తాభిషేకాలు చేసి, అనంతరం పుష్పాలంకరణ చేశారు. అనంతరం అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించారు.ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో దాతల సహకారంతో దేవస్థానం ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

ప్రారంభానికి సిద్ధం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గోదాం

దత్తిరాజేరు: మండలంలోని పోరలి గ్రామ సమీపంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్మించిన బహుళ ప్రయోజన సౌకర్య గోదాం నిర్మాణ పనులు పూర్తికావడంతో ప్రారంభానికి సిద్ధమైంది. నాబార్డ్ నిధులు రూ.40 లక్షలతో 500 మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తుల నిల్వసామర్థ్యంతో ఈ గోదాం నిర్మించారు. గోదాం ఆవరణలోనే రైతులు పంట తూకం వేయడానికి వేబ్రిడ్జ్ నిర్మాణం కూడా చేపట్టారు. ఉన్నతాధికారులు పరిశీలించిన అనంతరం ప్రారంభిస్తామని పోరలి పీఏసీఎస్ కార్యదర్శి బలరాం ఆదివారం తెలిపారు.

చెరువులకు జలకళ



వర్షపు నీటితో నిండిన గర్భాం చెరువు

మెరకముడిదాం: మండలంలో ఇటీవల భారీవర్షాలు కురవడంతో పలు గ్రామాల్లో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభ సమయానికే చెరువులు వర్షం నీటితో నిండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి



రక్తదానం చేస్తున్న యువత

విజయనగరం టౌన్: ఆపదలో ఉన్నవారికి అత్యంత అవసరమైన రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని కన్స్యూమర్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. మాతృభూమి సేవా సంస్థ అధ్యక్షుడు ఇప్పలవలస గోపి పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని ఎస్‌వీఎస్ రక్తనిధి కేంద్రంలో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం పట్ల ప్రజలు అపోహలు విడనాడాలన్నారు. రక్తదానం చేసిన వ్యక్తి చురుకుగా, ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. రక్తదానం చేసిన దాతలను లోక్‌సత్తా రాష్ట్ర నాయకులు భీశెట్టి బాబ్జీ సత్కరించారు. శిబిరంలో 50 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వికాస్, అజయ్, కాంచన, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

అభయాంజనేయునికి నృత్యనీరాజనం



ప్రశంసా పత్రాలు అందుకున్న చిన్నారులతో ఆలయ కమిటీ ప్రతినిధులు

విజయనగరం టౌన్: స్థానిక కామాక్షీనగర్‌కి చెందిన శ్రీసూర్య నృత్య అకాడమీ విద్యార్థులు రామనారాయణంలోని అభయాంజనేయునికి నృత్యనీరాజనం సమర్పించారు. అకాడమీ వ్యవస్థాపకులు రామ్ కాశ్యప్ ఆధ్వర్యంలో ఐశ్వర్యజ్యోతి బృందం అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. నృత్యప్రదర్శన చేసిన చిన్నారులు యశస్విని, సంజన, అక్షిత, వర్షిత, జనని, సునంద, భూమి, ఆద్యా, లాస్యశ్రీ, సంజన, నేహశ్రీలను ఆలయ కమిటీ ప్రతినిధులు అభినందించారు. అనంతరం చిన్నారులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేస్తున్న కోటేశ్వరరావు దంపతులు

శృంగవరపుకోట: భర్తాపురం గ్రామంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మోక్ష విద్య యోగ మందిర్ వ్యవస్థాపక నిర్వాహకులు షీలా కోటేశ్వర రా వు నేతృత్వంలో విద్యార్థులకు ఆదివారం భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే ఎస్.కోటకు చెందిన చిన్నపిల్లలకు భగవద్గీత శ్లోకాలు నేర్పారు. భగవద్గీతను ఎవరు ఎవరికి ఎప్పుడు, ఎక్కడ ఎలా బోధించారు. భగవద్గీతను మనం ఎందుకు నేర్చుకోవాలి, మనిషి నిత్య జీవితంలో భగవద్గీత ఎలా ఉపయోగపడుతుంది అనే అంశాలను కోటేశ్వర రావు దంపతులు పిల్లలకు అర్థమయ్యేలా బోధించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నపిల్లల మెదళ్లు, హృదయాలు పరిశుద్ధమైనవని, వాటికి మనం నేర్పే అంశాలను చాలా ఖచ్చితంగా స్వీకరిస్తాయని చెప్పారు. పిల్లలకు తల్లిదండ్రులు నైతిక విలువ లు, సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేస్తూ పెంచాలని సూచించారు. ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కలను సంరక్షిద్దాం



ఎస్.కోట పెద్దవీధి శివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న రామకృష్ణ, తదితరులు

శృంగవరపుకోట: ప్రతి ఒక్కరూ సాధారణ మొక్కలతో పాటు ఔషధ మొక్కలు నాటి సంరక్షించాలని గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) వ్యవస్థాప కులు రామకృష్ణ అన్నారు. ఎస్.కోటలోని పెద్ద వీధి శివాలయ ప్రాంగణంలో ఔషధ గుణాలు ఉన్న రావి, వేప మొక్కలను ఆదివారం నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావి చెట్టు అత్యధిక మోతాదులో ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయని, వేపచెట్టు చెడు బ్యాక్టీరియాను దరి చేరనివ్వదని అన్నారు. మనిషి మానసిక, శారీరక ఆరోగ్య వికాసానికి ఉపయోగపడే దేవాలయ ప్రాంగణాల్లో ఔషధ గుణాలు ఉన్న మొక్కలను నాటాలన్నారు. పట్టణంలోని ఆలయాల వద్ద మొక్కలు నాటుతూ వాటిని సంరక్షిస్తున్న పట్టణవాసులు ఇంటి కోటేశ్వరరావు, పూడి రాజును ఆయన అభినందించారు.

ఆదర్శప్రాయుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గజపతినగరం రూరల్: భారతీయ జనతా పార్టీ(బీజేపీ) వ్యవస్థాపకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆదర్శ ప్రాయుడని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దేవర ఈశ్వర రావు అన్నారు.శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని గజపతినగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఈశ్వర రావు మాట్లాడుతూ బీజేపీ ఆవిర్భావానికి ఆద్యుడైన ముఖర్జీకి పార్టీలో ఉన్న ప్రతీ ఒక్కరూ రుణపడి ఉంటారన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం కార్యకర్తలపై ఉందని అన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేదగాయత్రీ ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో వేద గాయత్రీమాత

విజయనగరం టౌన్: స్థానిక పద్మావతీనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సమీపంలో కొలువైన శ్రీలక్ష్మీగణపతి, కాశీవిశ్వేశ్వరస్వామి, నవగ్రహ, వల్లీదేవసేన, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సమేత వేదమాత గాయత్రీదేవి ఆలయ పదో వార్షికోత్సవాన్ని ఆదివారం కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. ఉదయం 9 గంటలకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, దీక్షాకంకణధారణ, మండపారాధనలు నిర్వహించారు. సాయంత్రం రుద్రాభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, నక్షత్ర హారతి, తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

26న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

వేపాడ: స్థానిక శ్రీదేవి, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం తొమ్మిదో వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త రాపర్తి చిరంజీవి ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి ఉదయం సుప్ర భాతసేవ, అభిషేకాలు, 9 గంటలకు స్వామివారి కల్యాణం జరిపించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఆలయం వద్ద మధ్యాహ్నం భక్తుల కు అన్నసమారాధన చేయనున్నట్లు తెలిపారు.

కార్పొరేషన్ పదవుల్లో అవకాశం కల్పించాలి

చీపురుపల్లి: ఏపీ కాపు కార్పొరేషన్‌లో పదవులను రాజకీయ ప్రమేయం లేకుండా కాపుసంఘం ప్రతినిధులకు మాత్రమే ఇవ్వాల ని సీఎం చంద్రబాబునాయుడును ఆ సంఘం రాష్ట్ర ప్రతినిధులు కోరారని, ఏపీ కాపు సేవా సమితి జిల్లా ప్రతినిధి సర్వశెట్టి వెంకటేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ కాపు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ కోదండపాని నేతృత్వంలో సీఎం చంద్రబాబును కలిసినట్లు తెలిపారు. కాపు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ పదవులు రాజకీయాల్లో ఉన్న వారికి కట్టబెడితే క్షేత్రస్థాయిలో ఉన్న వారికి ఎలాంటి ప్రయోజనం ఉండడం లేదని తెలిపారు. అందుకే కాపు సంఘ రాష్ట్ర స్థాయిలో ఉన్న ప్రతినిధులకు ఆ పదవులను కట్టబెట్టడం ద్వారా సంబంధిత సామాజిక వర్గాలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్‌ఐ దేవి

మెంటాడ: మండలంలోని పెదమేడపల్లి ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ దేవి మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో యువత ఎక్కువగా మద్యం, గంజాయి, కొకైన్, హెరాయిన్, గుట్కా వంటి మత్తపదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఎవరైనా మాదకద్రవ్యాలు వినియోగించినట్లు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. చెడుఅలవాట్ల బారినపడకుండా మంచి అలవాట్లు అలవర్చుకోవాలన్నారు.

పచ్చిరొట్టతో నేల సారవంతం



నేల సారవంతానికి చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: పచ్చిరొట్ట ఎరువుతో నేల సారవంతమవుతుందని ఏవో జి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో పీఎమ్‌డీఎస్ క్రాప్ కటింగ్, పచ్చిరొట్ట విత్తనాల ప్రయోజనాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన పంట సాగుకు ముందు ప్రతీ రైతు తమ పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు వేసుకుని, సాగు చేయాలన్నారు. అలా పెరిగిన పచ్చిరొట్ట మొక్కలను అదే నేలలో కలియదున్నాలని తద్వారా భూసారం పెరిగి, ఆ తర్వాత వేసుకునే ప్రధాన పంటకు కావాల్సిన పోషకాలు నేల నుంచి లభిస్తాయన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, సర్పంచ్ కె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగౌరమ్మ వారాల పండగ



గజపతినగరం రూరల్: గంగచోళ్లపెంటలో పూజలందుకుంటున్న మజ్జిగౌరమ్మ

గజపతినగరం రూరల్: మండలంలోని గంగచోళ్ల పెంటలో గ్రామదేవత మజ్జిగౌరి అమ్మవారి వారాల పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు తెల్లవారు జాము నుంచే అమ్మవారి ఆలయానికి చేరుకుని, ప్రత్యేక పూజలు చేశారు. పండగను పురస్కరించుకుని గ్రామంలో ఏర్పాటు చేసిన కోలాటం, తప్పిటగుళ్లు, నాటుభళ్ల వేషాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కరకవలసలో పశలమ్మ పండగ

వేపాడ: మండలంలోని కరకవలస గ్రామంలో పశలమ్మ తల్లి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఉదకం, పసుపును పశువులపై చల్లి పశువులు ఆరోగ్యంగా ఉండేలా చూడాలని, పంటలు సమృద్ధిగా పండేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. ఏటా ఖరీఫ్ వరి నారుమ డులు తయారు చేసే ముందు అమ్మవారి పండగ నిర్వహించడం తమ పూర్వీకుల నుంచి సాంప్రదాయకంగా వస్తోందని గ్రామపెద్దలు తెలిపారు.

మహిళా కానిస్టేబుళ్లకు సన్మానం



మహిళా కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

శృంగవరపుకోట: సమాజంలో శాంతి భద్రతలు పరిరక్షించి, అందరి సౌఖ్యం కోసం ఆరాటపడుతూ కత్తిమీద సాములా విధులు నిర్వర్తిస్తున్న పోలీసుల సేవలు నిరుపమానం అని వాసవీ క్లబ్ కేసీజీఎఫ్ వైస్ ప్రెసిడెంట్ వెంకటపద్మజ, కో–ఆర్డినేటర్ బి.సీతామహాలక్ష్మి అన్నారు. ఎస్.కోట మండలంలోని సంతగవిరమ్మపేట గ్రామంలో సీతంపేట వాసవీ క్లబ్ అధ్యక్షుడు కుసుమంచి నానాజీ నేతృత్వంలో డాన్ టూ డెస్క్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అతిథులుగా హాజరైన వెంకటపద్మజ, సీతామహాలక్ష్మి తదిత రులు ఎస్.కోట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబుళ్లను సన్మానించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్య,వైద్య రంగాల్లో సేవాకార్యక్ర మా లు నిర్వహిస్తున్న వాసవీ క్లబ్‌లు మరింత విస్తృతంగా తమ సేవలు విస్తృతం చేయాలన్నారు. రాపాక సర్వదేముళ్లు, హరీష్, పి.శ్రీనివాసరావు తదితరులతో పాటు పలువురు వాసవీ క్లబ్ వనితలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కళాకు ఘనంగా స్వాగతం



ఎమ్మెల్యే కళా వెంకటరావును సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, తదితరులు

చీపురుపల్లి: ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసి తొలిసారి చీపురుపల్లి వచ్చిన కిమిడి కళా వెంకటరావుకు టీడీపీ శ్రేణులు ఆదివారం ఘనంగా స్వాగతం పలికాయి. విజయవాడ నుంచి విశాఖపట్నం చేరుకున్న ఆయనకు నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడి దాం, గుర్ల మండలాల ముఖ్యనేతలు విశాఖలోని ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతం పలికారు. అక్కడి నుంచి చీపురుపల్లి వచ్చి స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సభా వేదిక వద్ద పార్టీ శ్రేణులను ఎమ్మెల్యే కలిశారు. ఆయన్ని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, ఆయ న కుమారుడు అనురాగ్ ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ టీడీపీ మాజీ ఇన్‌చార్జి కె.త్రిమూర్తులురాజు, పార్టీ శ్రేణులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీ ఏఎస్.కళ్యాణ్ చక్రవర్తి, ఎంపీడీఓ డి.శ్వేత, తహసీల్దార్ ఎస్.ప్రసాద్, తమ సిబ్బందితో ఎమ్మెల్యేను కలిసి శుభా కాంక్షలు తెలిపారు. నాలుగు మండలాల టీడీపీ నాయకులు ముల్లు రమణ, రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, పైల బలరాం, రెడ్డి గోవింద, సురేష్, వెన్నె సన్యాశినాయుడు, దాసరి శివప్రసాద్, తాడ్డి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..



పోరలి సమీపంలో కల్వర్టు మధ్యలో రోడ్డుపై ఏర్పడిన గొయ్యి



పెదమానాపురం సంత -జక్కువ రోడ్డులో మజ్జిగౌరమ్మ ఆలయం వద్ద మలుపులో ఏర్పడిన గోతుల్లో నిలిచిన వర్షం నీరు

దత్తిరాజేరు: మండలంలోని పోరలి క్వారీ సమీపంలో తారురోడ్డు మధ్యలో కల్వర్టు వద్ద ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. ఈమార్గం లో రోజూ వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. కల్వర్టుపై ఏర్పడిన గొయ్యిని వాహన చోదకులు గుర్తించకుండా ప్రయాణం సాగిస్తే ప్రమాదం తప్పదు. ఇటీవలే గొయ్యికి అడ్డంగా కర్రలు ఏర్పాటు చేశారు. అయితే రాత్రి సమయాల్లో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు స్పందించి వెంటనే గొయ్యిని పూడ్చి వేయాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు. అలాగే పెదమానాపురం సంత నుంచి జక్కువ రోడ్డులో మజ్జి గౌరమ్మ గుడి వద్ద మలుపు తిరిగే చోట రోడ్డు గోతులు తేలింది. ఏమాత్రం వర్షం కురిసినా ఈ గోతులు నీటితో నిండిపోతున్నాయి. ఆ మార్గంలో కొత్తగా ప్రయాణించే ద్విచక్ర వాహన చోదకులు గోతులను గుర్తించక ప్రమాదాల బారినపడుతున్నారు. అధికారులు స్పందించి మలుపు వద్ద ఉన్న గోతులను పూడ్చి వేయించాలని పలువురు వాహనచోదకులు కోరుతున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



మొయిదలో ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంతం-ప్రభోద సేవా సమితి జిల్లా కమిటీ

నెల్లిమర్ల రూరల్: జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని మొయిద, పూతికపేట, కొండగుంపాం గ్రామాల్లో ఆదివారం త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని నిర్వహించారు. త్రైత సిద్ధాంతం–ప్రభోద సేవా సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు ఆయా గ్రామాల్లో పర్యటించి భగవద్గీతపై ప్రజలకు అవగాహన కల్పించారు. త్రైత సిద్ధాంత భగవద్గీతలోని అంశాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవడంతో పాటు వాటిని అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శంకరరావు, ప్రసాద్, రాజప్పడు, ఆదినారాయణ, జయలక్ష్మి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.